భూతగాధల్లో ఒకరి హత్య

కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో భూ తగాదాలతో ఒక వ్యక్తి హత్యకు గురయ్యారు. ఈ సంఘటన శనివారం రాత్రి వెలుగు చూసింది. లింగాపూర్ గ్రామానికి చెందిన బండారి రాజిరెడ్డిని(55) దారుణంగా హత్య చేసి గ్రామ శివారులోని ఓ పాడు పడ్డ బావిలో పూడ్చిపెట్టిన గుర్తు తెలియని దుండగులు. శుక్రవారం రాజిరెడ్డి తన బైక్ పై ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం రాజిరెడ్డి బైకును శివారు ప్రాంతంలో గుర్తించారు.. స్థానికంగా గాలించడంతో రాజిరెడ్డి హత్యకు గురైన విషయం బహిర్గతమైంది. రాజిరెడ్డి మృతదేహాన్నిబావిలో నుంచి బయటకు తీసిన దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కామారెడ్డి డి.ఎస్.పి మధుసూదన్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ను పర్యవేక్షిస్తున్నారు. రాజిరెడ్డి హత్య నేపథ్యంలో లింగాపూర్ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికేటింగ్ ఏర్పాటు చేసి పోలీసులు బారీ బందోబస్తు ను చేపట్టారు.

తప్పని 'బండ' బాదుడు-ముక్కుపిండి అదనపు వసూళ్లు

భారత్ గ్యాస్ నిర్వాహకుల నిలువు దోపిడీ

వినియోగదారుల వద్ద నుంచి అధిక డబ్బులు వసూలు

రుద్రూర్, బతుకమ్మ : భారత్ గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో నిబ్బంది నిర్ణీత ధర కంటే అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నట్లు చాలా చోట్ల వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. రుద్రూర్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో భారత్ గ్యాస్ డెలివరీ బాయ్స్ గ్యాస్ వినియోగదారుల నుంచి ముక్కు పిండి అదనపు వసూళ్లు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపి స్తున్నారు. ప్రభుత్వం లేదా ఆయిల్ కంపెనీలు నిర్దేశించిన అసలు ధరకే సిలిండర్ ఏజెన్సీలకు చేరుతుంది. అయితే, రవాణా, హమాలీ, మెట్లెక్కింపు లేదా నిర్వహణ ఖర్చుల పేరుతో డెలివరీ బాయ్స్ అదనపు ఛార్జీలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి భారత్ గ్యాస్ నిర్వాహకులపై, డెలివరీ బాయ్స్ పై తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పదవీ విరమణ తప్పని ఘట్టం...

33 ఏళ్ల సుదీర్ఘ కాలంలో అనేక ఒడుదుడుకులు

ఎంపీఓ రాజ్ కాంత్ రావుకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

ఇందల్వాయి, బతుకమ్మ:పంచాయతీ శాఖలో సుదీర్ఘ కాలం పాటు నిరంతరాయంగా విశిష్ట సేవలు అందించిన మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఎమ్.రాజ్ కాంత్ రావు శనివారం ఉద్యోగ పదవీ విరమణ చేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా ఉద్యోగ పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బిల్ కలెక్టర్ స్థాయి నుండి 'మండల అధికారి' వరకుగత 33 సంవత్సరాల క్రితం పంచాయతీ శాఖలో సాధారణ బిల్ కలెక్టర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన రాజ్ కాంత్ రావు, తన అంకితభావం, కష్టపడే తత్వంతో క్రమంగా పదోన్నతులు పొందుతూ ఎంపీఓ స్థాయికి ఎదిగారు. క్షేత్రస్థాయి నుండి మండల స్థాయి వరకు గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పన,

పంచాయతీల అభివృద్ధి, పల్లెల ప్రగతిలో ఆయన పోషించిన పాత్ర ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. ఈ సన్మాన మహోత్సవంలో పాల్గొన్న పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు రాజ్ కాంత్ రావు సేవలు అభినం దనీయమని ఆయనతో ఉన్న వృత్తిపరమైన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం రాజ్ కాంత్ రావు దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను బహుకరించి ఘనంగా వీడ్కోలు పలికారు. సమర్థవంతమైన సేవలు అందించి రిటైర్ అవుతున్న రాజ్ కాంత్ రావు ఇకపై తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, ప్రశాంతమైన శేషజీవితాన్ని గడపాలని సహోద్యోగులు, స్థానిక ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో అనంతరావు, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సుదర్శన్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య బదిలీ

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ లీగల్ అడ్వయిజర్ గా బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ ఎస్. సాంబశివ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రంగపేట్ గ్రామానికి చెందిన లక్ష్మీ నర్సయ్య పడాల రామిరెడ్డి లా కాలేజ్ నుండి లా పట్టభద్రులయ్యారు. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహించిన అన్ని పరీక్షలలో ఆయన ఉత్తీర్ణుడై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా సెలెక్ట్ అయినారు. మొదట 2008 సంవత్సరంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నిర్మల్ లో విధులు నిర్వహించారు. సెప్టెంబర్, 2022 లో నిజామాబాద్ కోర్టుకు బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ గా విధులలో ఉన్నారు.

పలువురు ఎపిపిల బదిలీ

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ను బదిలీ చేస్తూ తెలంగాణ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా లక్ష్మీ మనోజ్ఞ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్ ఎసిబి కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ మెడ్చల్ మల్కాజ్గిరి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. రవిని బొనగిరి కి బదిలీ చేశారు.హన్మకొండ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఉన్న వనజను హైదరాబాద్ ఏసిబి కోర్టు కు, సిరిసిల్ల కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. లక్ష్మీ ప్రసాద్ ను మంథని కోర్టులకు బదిలీ చేశారు.

నర్సయ్య

రహీమోద్దీన్

ఇంచార్జీ డిడిపిఒ గా మహమ్మద్ రహీమోద్దీన్

నిజామాబాద్ మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులలో ఉన్న మహమ్మద్ రహీమొద్దీన్ ను నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి

మహిళా వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ లో మాక్ పార్లమెంట్ నిర్వహణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :విద్యార్థి దశ నుండే బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటి స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా చట్ట సభలలో జరిగే సమావేశాల తీరును కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరింపజేశారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన వారు ప్రశ్నలను లేవనెత్తగా, సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ అద్యంతం ఎంతో ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు ఎంతో చక్కగా ఇమిడిపోయి రాణించడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ తన తరఫున పలువురికి ప్రత్యేక బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, తాము ఆశించిన దానికంటే ఎంతో ఉత్తమంగా బాలికలు రాణించి మాక్ పార్లమెంట్ ను విజయవంతం చేశారని ప్రశంసించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, స్మార్ట్ ఫోన్లలో అనవసర విషయాలకు సమయం వృధా చేయకూడదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యాల పరిరక్షణ కోసం తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నిస్సంకోచంగా అధికారుల దృష్టికి తేవాలని, భద్రతా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు భరోసా కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను సమ దృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్షను ప్రదర్శించకూడదని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా

ప్రోత్సహించాలని హితవు పలికారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కేరళలో అక్షరాస్యత 90 శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా అక్షరాస్యతను గణనీయంగా వృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము గమనించిన పలు సమస్యలు, ఇబ్బందుల గురించి బాలికలు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరఫున తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, జిలా సంక్షేమ అధికారిణి పద్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.